సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 10 । జనవరి । 2023



సికిల్‌సెల్ ఎనీమియా నివారణకు కృషి 8లో



ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం సహించం 8లో



ప్రజా సంకల్పయాత్ర చరిత్రాత్మకం 8లో

న్యూస్‌రీల్

వార్డెన్, హెచ్‌ఎంలకు షోకాజు నోటీసులు



ఎస్సీ హాస్టల్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఎటపాక: విధి నిర్వహణలో అలసత్వం వహించిన వార్డెన్, హెచ్‌ఎంకు చింతూరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సోమవారం షోకాజు నోటీసులు జారీచేశారు. ఈనెల 6న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఎటపాక మండలం గొరిదేవిపేటలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించారు. వసతి గృహం నిర్వహణ సరిగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతోపాటు ఆమె అక్కడి సిబ్బందిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం చింతూరు ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ గొరిదేవిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ఎస్సీ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. హాస్టల్‌కు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన వార్డెన్ దానవ బాబుకు షోకాజు నోటీసు జారీచేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినందుకు గాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజులుకు కూడా ఆయన షోకాజు నోటీసు జారీచేశారు.

జి.మాడుగుల పోలీస్ స్టేషన్‌లో డీఐజీ తనిఖీలు



పోలీస్ స్టేషన్‌లో డీఐజీ హరికృష్ణ

జి.మాడుగుల: స్థానిక సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం డీఐజీ హరికృష్ణ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ భద్రతను స్వయంగా పరిశీలించారు. కేసులపై ఆరా తీసి, రికార్డులు తనిఖీ చేశారు. ఇక్కడ పోలీసు సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఆయన వెంట ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీ శివప్రతాప్ కిశోర్ ఉన్నారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాస్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'స్పందన'కు 39 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో సబ్ కలెక్టర్ శుభం బన్సల్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఏజెన్సీ మారుమూల గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి 39 అర్జీలు స్వీకరించినట్టు సబ్ కలెక్టర్ తెలిపారు. అడ్డతీగల మండలం దాన్యంపాలెం పంచాయతీలోని చాపరాతిపాలెం, చిన మునకనగడ్డ గ్రామాల్లో పాఠశాల భవనాలు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. రావులపాడు – పెనికిలపాడు మధ్య ఐదు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించాలని సర్పంచ్ వెంకాయమ్మ కోరారు. దేవీపట్నం మండలం ఇందుకూరు పేటలో భూ సమస్య పరిష్కరించాలని చల్లాబత్తుల రామకృష్ణ అనే వ్యక్తి అర్జీ అందజేశారు. ఎంబీఏ చదివి ఖాళీగా ఉన్నానని ఉద్యోగం కల్పించాలని దేవీపట్నం మండలం శరభవరం గ్రామానికి చెందిన మిట్టపల్లి సింహాచలం కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావు, ఈఈ డేవిడ్‌రాజు, ఏపీడీ వెలుగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు తారుమారు సంత



తారుమారు సంతకు ఏర్పాట్లు చేస్తున్న సర్పంచ్ రాంబాబు, కమిటీ సభ్యులు

జి.మాడుగుల: స్థానిక వెంకటరాజు ఘాట్ వద్ద పంట పొలాల్లో మంగళవారం తారుమారు (పండగ) సంత నిర్వహించనున్నారు. ప్రతీ సంవత్సరం సంక్రాంతి సందర్భంగా ఈ తారుమారు సంత నిర్వహించడం ఆనవాయితీ. సర్పంచ్ కిముడు రాంబాబు ఆధ్వర్యంలో సంత నిర్వహణ కమిటీ సభ్యులు మత్స్యరాస నాగరాజు, గిరి, సాయి, బాబూరావు, సతీష్‌కుమార్ ఏర్పాట్లు చేశారు. తారుమారు సంతకు ఎటువంటి ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

పన్నుల వసూలుకు రెడీ

- ఇష్టానుసారంగా రిసార్ట్స్‌లు, అతిథి గృహాల నిర్వహణ
- లైసెన్స్‌లు పొందకుండా కార్యకలాపాలు
- నేడు పన్నులపై డీపీవో ఆధ్వర్యంలో సమావేశం



రంపచోడవరం: ఏజెన్సీలో అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా రిసార్ట్స్ నిర్వహిస్తూ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై అధికారులు దృష్టి సారించారు. వారి నుంచి పన్నులు, లైసెన్స్ ఫీజు వసూలు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. ఏజెన్సీలో పుట్టగొడుగుల్లా రిసార్ట్స్, అతిథి గృహాలు వెలిశాయి. కొంత మంది రిసార్ట్స్ నిర్వాహకులు పంచాయతీ కనీసం పన్ను కూడా చెల్లించడం లేదు. మన్యంలో బస చేసి, ఇక్కడ అందాలు తిలకించేందుకు అనేక మంది పర్యాటకులు వస్తున్నారు. అతిథిగృహాలు, రిసార్ట్స్ నిర్వాహకులు డిమాండ్‌ను బట్టి ధరలు నిర్ణయించి సొమ్ము చేసుకుంటున్నారు.

అనుమతులు తప్పనిసరి

ఏజెన్సీలో రిసార్ట్స్, అతిథి గృహాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి. అనుమతులు కోసం రిసార్ట్స్ నిర్వాహకులు పొజిషన్ సర్టిఫికెట్, ల్యాండ్ కన్వర్షన్ సర్టిఫికెట్ పంచాయతీలకు సమర్పించాలి. పంచాయతీ తీర్మానం చేసిన తరువాత అనుమతులు మంజూరు చేసి, కట్టాల్సిన లైసెన్స్ ఫీజును నిర్ధారిస్తారు. రిసార్ట్స్, అతిథి గృహాల ఆదాయాన్ని బట్టి లైసెన్స్ ఫీజులను నిర్ణయించే అధికారం పంచాయతీలకు ఉంది. ఏజెన్సీలో రిసార్ట్స్ నిర్వాహకులు లైసెన్స్ ఫీజులు చెల్లిస్తే పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల్లో సార్ట్స్, అతిథి గృహాలు ఎక్కువగా ఉన్నాయి. వీటి నుంచి పంచాయతీలకు ఎటువంటి ఆదాయం రావడం లేదని పలువురు సర్పంచ్‌లు గతంలో ఫిర్యాదు చేశారు. పంచాయతీలు ఆర్థిక పరిపుష్టి సాధించాలంటే అన్ని మార్గాల నుంచి ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. ఆ దిశగా పంచాయతీ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు రంపచోడవరంలో మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో ఏజెన్సీలో పన్ను బకాయిలతో పాటు రిసార్ట్స్,అతిథి గృహాలకు సంబంధించిన లైసెన్సుల విషయంపై చర్చించనున్నట్టు సమాచారం. మారేడుమిల్లి, రంపచోడవరం మండలాల్లో సుమారు 300 వరకు అతిథి గృహాలు, రిసార్ట్స్‌లు ఉన్నాయి.

అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

రిసార్ట్స్ నిర్వాహకులు, అతిథి గృహాల యజమానులు లైసెన్స్ కోసం పంచాయతీలకు దరఖాస్తు చేసువాలి. అందుకు తగిన పత్రాలు సమర్పించాలి. వీటిని పరిశీలించిన తరువాత లైసెన్స్ ఫీజు నిర్ధారించడం జరుగుతుంది.

–ఎస్.వివేక్, డీఎల్‌పీవో, రంపచోడవరం

నత్త కంటే దారుణం..
సెర్ప్ విచారణ

నిధుల దుర్వినియోగం జరిగి ఏడాదవుతున్నా పూర్తికాని దర్యాప్తు



అసంపూర్తిగా ఉన్న జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ భవనం



రంపచోడవరం తహసీల్దార్ కార్యాలయం బయట పడేసిన పసుపుకొమ్ముల బస్తాలు

రంపచోడవరం: అన్నదాతలకు ఆర్థిక పరిపుష్టి కల్పించాలన్న లక్ష్యంతో రైతు ఉత్పత్తిదారుల సంఘాల(ఎఫ్‌పీవో)కు అందజేసిన నిధులు దుర్వినియోగం చేసిన వ్యవహారంపై విచారణ ఏడాదిగా కొనసా...గుతోంది. ఈ వ్యవహారంలో అప్పటి వెలుగు ఏపీడీ, మరో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. రంపచోడవం డివిజన్‌లోని ఏడు మండలాల్లో 700 ఎఫ్‌పీవోలు ఉన్నాయి. ఒక్కో సంఘానికి రూ.60 లక్షల చొప్పున కేటాయించారు. ఆ సొమ్మును పెట్టుబడి పెట్టి సంఘంలోని సభ్యులు వ్యవసాయం చేసి, ఉత్పత్తులను విక్రయించగా వచ్చిన లాభాలను పంచుకోవాలి. లేదా వేరే రైతులు పండించిన ఉత్పత్తులను కొనుగోలు చేసి, అమ్మగా వచ్చిన లాభాలు పంచుకోవచ్చు. మూలధనం రూ.60 లక్షలను మళ్లీ సంఘం ఖాతాలో జమచేయాలి. అయితే కొందరు అధికారులు ఎఫ్‌పీవోల నుంచి అడ్డుగోలుగా నిధులు డ్రాచేశారు. ఇలా రూ.1.88 కోట్లు దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు. దీనిపై గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు చేపట్టిన విచారణ నత్తనడక కంటే దారుణంగా ఉంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు చెందిన నిధులను బ్యాంకుల నుంచి డ్రా చేసి ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ విచారణ ఓ కొలిక్కి రాలేదు.

ఎఫ్‌పీవోలకు సంబంధం లేకుండా వ్యాపారం

ఎఫ్‌పీవోలకు సంబంధం లేకుండా ఆ ఖాతాల నుంచి తీసిన డబ్బులతో కొండచీపుళ్లు, పసుపు కొమ్ములు, జీడిపిక్కలను వెలుగు అధికారులు కొనుగోలు చేశారు. ఇందుకోసం ఎంత ఖర్చు చేశారో లెక్కలే లేవు. ఎఫ్‌పీవోల నుంచి డ్రా చేసిన సొమ్ముతో వన్‌ధన్ వికాస కేంద్రాలకు అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసినట్టు లెక్కలు చూపుతున్నారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. ఎందుకంటే వన్‌ధన్ వికాస కేంద్రాల వారే అటవీ ఉత్పత్తులను సేకరించి మార్కెట్ చేసుకోవాలి. కానీ ఇక్కడ వెలుగు సిబ్బందే అన్నీ చేశారు. డ్రా చేసిన నగదులో సగం కూడా ఖర్చు చేయలేదు. ఇలా కొనుగోలు చేసిన పసుపు కొమ్ముల బస్తాలను రంపచోడవరం తహసీల్దార్ కార్యాలయం పక్కన పడేశారు. వెలుగు ద్వారా తయారు చేసిన పసుపు డబ్బాలు, కొండచీపుళ్లు బలవంతంగా మహిళా సంఘాలకు అంటగట్టారు. ఇందుకు వెలుగు యానిమేటర్లు, సీసీలపై తీవ్ర ఒత్తిడి చేశారు. రంపచోడవరం సమీపంలోని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ఆవరణలో ఏర్పాటు చేసిన జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ కొన్ని రోజులకే మూతపడింది. కొనుగోలు చేసిన జీడిపప్పు నిరుపయోగంగా మారింది. మిగిలిన జీడిపిక్కలను బయట వ్యాపారులకు అమ్మి చేతులు దులుపుకొన్నారు. రూ.30 లక్షల వ్యయంతో సిరిగిందలపాడు వద్ద నిర్మాణం చేపట్టిన జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ భవనం నిర్మాణం శ్లాబ్ దశలోనే ఆగిపోయింది. చింతూరు మండలంలో స్వయం సహాయక సంఘాలకు చెందిన రూ.30 లక్షలు దుర్వినియోగమైనట్టు విచారణ కమిటీ తేల్చింది. ఇందుకు బాధ్యులైన సీసీ, బుక్ కీపర్‌లపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. విచారణ నివేదికను ఉన్నతాధికారులు పంపించారు.

మండలాల వారీగా ఎఫ్‌పీవోల నుంచి డ్రా చేసిన నిధుల వివరాలు

మండలం	నగదు (రూ.లలో)
అడ్డతీగల	25,00,000
వై.రామవరం	45,00,000
రాజవొమ్మంగి	30,00,000
గంగవరం	30,00,000
దేవీపట్నం	8,00,000
రంపచోడవరం	20,00,000
మారేడుమిల్లి	30,00,000

విచారణ కొనసాగుతోంది

రైతు ఉత్పత్తిదారుల సంఘం బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు డ్రా చేసిన వ్యవహారంలో వెలుగు ఏపీడీ, ఏపీఎంలు సస్పెండ్ అయ్యారు. దీనిపై సెర్ప్ విచారణ కొనసాగుతోంది. విచారణ పూర్తయితేనే వాస్తవాలు వెలుగు చూస్తాయి.

–శ్రీనివాసరావు, ఏపీడీ వెలుగు, రంపచోడవరం

'పీవీటీజీ' ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సుమిత్ కుమార్



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: ఓటరు నమోదు ప్రక్రియలో క్రమశిక్షణ లోపిస్తే సహించనని, చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి ఐటీడీఏ పీవోలు,సబ్‌కలెక్టర్లు,తహసీల్దార్లు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పీవీటీజీ(ఆదిమజాతి)లను ఓటర్లుగా నమోదు చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. పీవీటీజీల జనాభా,ఓటర్లు, మహిళలు,పురుషుల వివరాలు సేకరించాలని, 18ఏళ్లు నిండిన పీవీటీజీ యువతీయువకులను గుర్తించి, ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. స్టేషనరీకి అవసరమైన నిధులను తహసీల్దార్‌లకు విడుదల చేశామని, ఫారం 6,7లను బూత్‌లెవెల్ అధికారులకు పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని, అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

భూ సర్వే వేగవంతం

జిల్లాలోని భూముల రిసర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. భూముల రిసర్వేకు సంబంధించి ఆయన మండలాల వారీగా సమీక్షించారు. ఫిబ్రవరి నెలాఖరు నాటికి 100 గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలన్నారు. 9(2) నోటీసులు జారీ, గ్రామసభల వివరాలను తెలుసుకున్నారు. మ్యుటేషన్ ప్రక్రియలో ఫ్యామిలీ ధ్రువీకరణపత్రాలను జారీ చేయాల్సిన బాధ్యత తహసీల్దార్‌లపైనే ఉందన్నారు. గిరిజనుల సాగులో ఉన్న పోరంబోకు భూములకు పట్టాలు పంపిణీ చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను రూపొందించాలని తెలిపారు.ఎయిర్‌టెల్ టవర్ల నిర్మాణానికి అవసరమైన భూములను గుర్తించాలని తహసీల్దార్లకు సూచించారు. ఈకార్యక్రమంలో జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్, సర్వే ఏడీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యంతోనే సమాజంలో మార్పు

హీరో సాయిధరమ్ తేజ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హీరో సాయిధరమ్‌తేజ్, సీఐ జి.డి.బాబు

అరకులోయరూరల్: చైతన్యంతోనే సమాజంలో మార్పు సాధ్యమని సినీ హీరో సాయిధరమ్ తేజ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం సీఐ జి.డి.బాబు ఆధ్వర్యంలో మెగా పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సాయి ధరమ్ తేజ మాట్లాడారు. యువతీయువకుల కోసం పోలీసుశాఖ ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. గంజాయి,డ్రగ్స్,మద్యం వంటి మత్తుపదార్థలకు విద్యార్థులు బానిస కాకుండా క్రమశిక్షణతో సన్మార్గంలో నడవాలని సూచించారు. ఉన్నతమైన చదువులు చదివి మంచి పౌరులుగా ఎదగాలన్నారు. ప్రతీ విద్యార్థి చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు. ఎస్‌ఐలు కుమార్ బాబు, సంతోష్ కుమార్, రాము, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెండు నియోజకవర్గాల్లో ఐదు వంతెనలు

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- కోడిమామిడి గెడ్డపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

జి.మాడుగుల: పాడేరు, అరకులోయ నియోజకవర్గాల్లో ఐదు వంతెనలను నిర్మించనున్నట్టు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలో బొయితిలి గ్రామ సచివాలయం పరిధిలో కిల్లంకోట పంచాయతీలోని కోడిమామిడి గెడ్డపై రూ.2.20 కోట్లతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణానికి సోమవారం ఐటీడీఏ పీవో గోపాలకృష్ణతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. వంతెనను నిర్మించే ప్రాంతాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతవాసుల చిరకాల కోరిక అయిన కోడిమామిడి గెడ్డ వంతెన నిర్మాణం త్వరలో సాకారం కాబోతోందని చెప్పారు. మారుమూల గిరిజన గ్రామాల్లో రహదారి, వంతెల నిర్మాణానికి ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తోందని తెలిపారు. మిషన్ కనెక్ట్ పాడేరు ద్వారా ప్రతీ గ్రామాన్ని అనుసంధానంచేస్తూ రహదారుల నిర్మాణాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఐటీడీఏ పీవో గోపాల కృష్ణ మాట్లాడుతూ కోడిమిమాడి గెడ్డపై బ్రిడ్జి నిర్మాణంతో ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాలకు చెందిన పలు గ్రామాలకు రవాణా సదుపాయం ఏర్పడుతుందని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిక ప్రతిపాదించామని తెలిపారు. మద్దిగరువులో పీహెచ్‌సీ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఏజెన్సీలో 1400 బీఎస్‌ఎన్‌ఎల్, 153 జియో, 200ఎయిర్‌టెల్ టవర్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, జి.మాడుగుల, జీకే వీధి జెడ్పీటీసీలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, ఎం.శివరత్నం, ఎంపీపీ కె.పద్మ, ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎంపీటీసీ ఎల్.అప్పలరాజు, సర్పంచ్ బి.ముత్యాలమ్మ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామకృష్ణ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ మత్స్యకొండంనాయుడు, మాజీ సర్పంచ్ ప్రసాదరాజు, డీఈ అనుదీప్, ఏఈ దేముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

• వణికిస్తూ...మురిపిస్తూ



జిల్లాను చలి వణికిస్తోంది. గతంలో ఎన్నడూ చూడని విధంగా వాహనాలు, పొలాలు, ఇళ్ల కప్పులపై మంచు పొరలు పొరలుగా పేరుకుపోతూ కశ్మీర్‌ను తలపిస్తోంది. కొద్ది రోజులుగా జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి తీవ్రత పెరగడంతో పాటు శీతల గాలులు వీస్తుండడంతో ఏజెన్సీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. చలి మంటలను ఆశ్రయిస్తూ ఉపశమనం పొందుతున్నారు. తెల్లని మంచు.. పొలాలను, చెట్లను ఆవరించడంతో ఆ అందాలను తిలకించి టూరిస్టులతో పాటు స్థానికులు పరవశించిపోతున్నారు.

- సాక్షి,పాడేరు, చింతపల్లి రూరల్







సంతృప్తి స్థాయిలో వైద్య సేవలు

- దేశంలోనే వినూత్నం 'ఫ్యామిలీ ఫిజీషియన్'
- ఆస్పత్రుల్లో ఖాళీలన్నీ భర్తీ
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- ఉత్తరాంధ్ర వైద్యశాఖ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, చిత్రంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్, విశాఖ కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట (విశాఖ దక్షిణ): వైద్య ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తున్నామని, ముఖ్యమంత్రి మరో అడుగు ముందుకేసి దేశం గర్వించదగ్గ బృహత్తర కార్యక్రమం 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. సోమవారం వీఎంఆర్డీఏ ఎరీనాలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కష్ణబాబుతో కలిసి ఉత్తరాంధ్ర వైద్యశాఖ అధికారులతో ప్రాంతీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫ్యామిలీ ఫిజీషియన్, విలేజ్ హెల్త్ క్లినిక్స్, అర్బన్ హెల్త్ క్లినిక్స్, వెక్టర్ కంట్రోల్ హైజీన్ మెజర్స్, ఎపిడమిక్ డిసీజ్ సర్వేలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగానే వైద్య పరీక్షలు, మెరుగైన వైద్యం అందించాలన్నదే 'ఫ్యామిలీ ఫిజీషియన్' ఉద్దేశమని చెప్పారు. వైద్య శాఖలో పూర్తిస్థాయి సిబ్బంది నియామకాలకు సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారన్నారు. మూడేన్నరేళ్లలో 47 వేల పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో ఎక్కడా మందుల కొరత లేదని వెల్లడించారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా రాష్ట్ర ప్రజలకు వైద్య సేవలు విస్తృతంగా, సంతృప్తి స్థాయిలో అందుతున్నాయన్నారు. కేజీహెచ్ అభివృద్ధిలో కలెక్టర్ మల్లికార్జున చూపిన చొరవకు అభినందనలు తెలిపారు. ఒక్కో వార్డు అభివృద్ధి, మౌలిక సదుపాయాల కోసం కలెక్టర్ ప్రత్యేకంగా నిధులు ఇచ్చారని అన్నారు.

వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ నిరుపేదల కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందిస్తున్నారన్నారు. విద్య, వైద్య రంగంలో ఏపీని మొదటి స్థానంలో నిలపడం ముఖ్యమంత్రి లక్ష్యమని పేర్కొన్నారు. కేజీహెచ్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన విశాఖ కలెక్టర్ మల్లికార్జునను అభినందించారు.

జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున మాట్లాడుతూ కేజీహెచ్, ఇతర ఆస్పత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించడానికి గాను పలు కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. రూ.3.3 కోట్ల సీఎస్ఆర్ నిధులను వెచ్చించి వివిధ పనులను నిర్వహించామన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలలో సిబ్బందిని భర్తీ చేయాలన్నారు. రూ.40 లక్షల సీఎస్ఆర్ నిధులతో పాడేరు ఏరియా ఆస్పత్రిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చినట్లు తెలిపారు. తద్వారా ఏజెన్సీలో గతంలో ఎన్నడూ లేని విధంగా 600 సర్జరీలు పూర్తి చేసినట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్ మాట్లాడుతూ గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించే క్రమంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలన్నారు. డీఎంహెచ్‌వో, డీసీహెచ్‌ఎస్‌లు సంయుక్తంగా కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐడీసీ ఎండీ మురళీధర్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి జీఎస్ నవీన్‌కుమార్, ఆరోగ్యశ్రీ ముఖ్య నిర్వహణ అధికారి హరీంద్ర ప్రసాద్, ఏపీడీఎంఈ డాక్టర్ వినోద్ కుమార్, విశాఖ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఆరు జిల్లాల నుంచి వచ్చిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, డీసీహెచ్‌ఎస్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఆర్‌పీఎఫ్ సేవలు



పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరంలో సీఆర్‌పీఎఫ్ డి–42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం పేదలకు భోజనం అందజేశారు. మండల కేంద్రంలో జరిగిన వారపు సంతతో పాటు వివిధ పనులపై వచ్చిన సుమారు 180 మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంటు ఎం.ఎల్.నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

గొండోలు వద్ద రెండు బైక్‌లు ఢీ



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పువ్వులరాజు

అడ్డతీగల: మండలంలోని గొండోలు వద్ద సోమవారం ఉదయం రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడగా, మరొకరి స్వల్ప గాయాలయ్యాయి. రంప చోడవరం మండలం ఉసిరి జొన్నలకు చెందిన పువ్వుల రాజు నర్సీపట్నం వైపు వెళ్తుండగా గొండోలుకి చెందిన బాతు భూషణం అడ్డతీగల వైపు వస్తుండగా ఎదురెదురుగా రెండు బైక్‌లు పరస్పరం ఢీకొన్నాయి. దీంతో పువ్వుల రాజు అనే వ్యక్తికి కుడిచేయి విరిగిపోయింది. బాతు భూషణంకు స్వల్పగాయాలయ్యాయి. ఇద్దరినీ 108 వాహనంలో అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పువ్వుల రాజుని కాకినాడ సామాన్య ఆసుపత్రికి రిఫర్ చేశారు. అడ్డతీగల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంకల్పయాత్ర చరిత్రాత్మకం



పాడేరులో కేకు కట్ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నరసింగరావు, నాయకులు



అడ్డతీగలలో మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, నేతలు

సాక్షి, పాడేరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర చరిత్రలో నిలుస్తోందని, పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా విజయోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు తమర్బ నరసింగరావు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ టీడీపీ నిరంకుశ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, వారి సమస్యలను తెలుసుకునేందుకు ప్రతిపక్ష నేత హోదాలో జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. పాదయాత్ర విజయవంతమవడంతో పాటు, ప్రజలంతా జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని ఆశించి ముఖ్యమంత్రిగా గెలిపించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. గిరిజనుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. బాక్సైట్ జీవోను రద్దు చేసి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. జిల్లా వ్యవసాయ సలహ మండలి అధ్యక్షురాలు ఎం.సరస్వతి, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, సర్పంచ్‌లు వి.బసవన్నదొర, వి.సీతమ్మ, వి.రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు రామకృష్ణ పాత్రుడు, నరసింహమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, మాజీ ఎంపీపీ మంగ్లన్నదొర, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామసత్యవతి, పార్టీ యువజన విభాగ పట్టణ అధ్యక్షుడు డి.పి.రాంబాబు, నాయకులు సుశీల, కన్నాపాత్రుడు, ఉర్వశిరాణి, రాజారావు, కొండబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర భవితను మార్చిన సీఎం జగన్: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

అడ్డతీగల: పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తూ సుపరిపాలన అందిస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలో జరిగిన వేడుకలో ఎమ్మెల్యే ధనలక్ష్మి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన వేడుకలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర భవితను మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. సుపరిపాలన అందిస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలుచేశారన్నారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కారు రాంబాబు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు

- తోటలూరులో రెండు వర్గాలకు సీఐ కౌన్సెలింగ్
- భూ వివాదం కోర్టులో ఉందని చెప్పిన సీఐ



ఇరువర్గాలతో మాట్లాడుతున్న సీఐ స్వామినాయుడు

కొయ్యూరు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని సీఐ స్వామినాయుడు హెచ్చరించారు. అంతా నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ఆయన సోమవారం రావణాపల్లి పంచాయతీ తోటలూరు సమీపంలో గొంప గోవింద్, నడిగెట్ల రాముకు మధ్య ఉన్న జీడితోట వద్ద ఇరువర్గాలతో సమావేశం నిర్వహించారు. ఆదివారం గొంప గోవింద్ ఆయన భూమిలో తడకలు పెట్టుకునేందుకు వెళ్తే దానిని అదే గ్రామానికి చెందిన రాము అడ్డుకున్నారు. దీనిపై మనస్థాపం చెందిన గోవింద్ పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించారు. వివాదం ముదిరే అవకాశం ఉందని భావించిన సీఐ నేరుగా ఇరు వర్గాలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివాదం ప్రస్తుతం కోర్టులో ఉందని, ఇలాంటి సమయంలో వివాదాలు పెట్టుకోవడం సరైంది కాదన్నారు. ఇరువర్గాలకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. కోర్టు తీర్పు వచ్చేంత వరకు వేచి చూడాలన్నారు. ఎవరూ శాంతి భద్రతలకు విఘాతం కల్పించరాదన్నారు. నడిగెట్ల రాముపై ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన గొంప గోవింద్ ఫిర్యాదు చేయగా, ఇటు గోవింద్‌పై రాము కూడా ఫిర్యాదు చేశారు. దీంతో రెండు వైపులా కేసులు నమోదు చేశారు.

టీటీడీ చైర్మన్ దృష్టికి గిరిజన సమస్యలు



టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి విశాఖపట్నంలోని సర్క్యూట్ హౌస్‌లో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిధిలో నెలకొన్న వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకులంగా స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అరకులోయలో నిర్మించిన టీటీడీ కల్యాణమండపం ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించినట్టు తెలిపారు.

యథావిధిగా ఆర్టీసీ బస్సు సర్వీసులు



రంపచోడవరం నుంచి కోట గ్రామం మీదుగా వై.రామవరం చేరిన ఆర్టీసీ బస్సుతో సిబ్బంది

వై.రామవరం: మండలంలోని కోట గ్రామానికి సోమవారం నుంచి ఆర్టీసీ బస్సు యథావిధిగా కొనసాగుతున్నాయి.గోకవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సర్వీసును శనివారం డిపో మేనేజరు రామన్నదొర ఆధ్వర్యంలో పునః ప్రారంభించిన విషయం విదితమే. గతంలో నడిచే ఈ సర్వీసును రోడ్డు బాగులేకపోవడంతో నాలుగేళ్ల క్రితం నిలిపివేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రోడ్డును పునర్నిర్మించడంతో గ్రామస్తుల విన్నపం మేరకు గోకవరం డిపో మేనేజరు రామన్నదొర స్పందిస్తు ఈ సర్వీసును పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం ఆ బస్సు వై.రామరరం చేరింది. డిపో సిబ్బంది ప్రకటించిన బస్సు సర్వీసు వివరాలిలా ఉన్నాయి. రోజు గోకవరం నుంచి ఉదయం 5.15 గంటలకు బయలుదేరి రంపచోడవరం చేరుకుంటుంది. రంపచోడవరం నుంచి ఉదయం 6.15 గంటలకు బయలుదేరి కోట గ్రామం మీదుగా ఉదయం 8 గంటలకు వై.రామవరం చేరుకుంటుంది. వై.రామవరం నుంచి తిరిగి 8.15కు బయలుదేరి కోట మీదుగా రంపచోడవరం చేరుకుంటుంది. అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12కు వై.రామవరం చేరుకుంటుంది. 12.45గంటలకు వై.రామవరం నుంచి బయలుదేరి రంపచోడవరం అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 4.30కు వై.రామవరం చేరుకుంటుంది. సాయంత్రం 4.45 గంటలకు వై.రామవరంలో బయలుదేరి కోట, రంపచోడవరం మీదుగా గోకవరం చేరుకుంటుందని పేర్కొన్నారు.

రోజు రెగ్యులర్‌గా రోజుకు 3 ట్రిప్పులు కొనసాగుతుందని తెలిపారు. బస్సు సర్వీసును గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

సికిల్‌సెల్ ఎనీమియా నివారణకు కృషి

పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్: ఏజెన్సీలో సికిల్‌సెల్ ఎనీమియా నివారణకు కృషి చేయాలని ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ తెలిపారు. సోమవారం పెరుమాల్ స్వస్థ సంస్థ ఆధ్వర్యంలో ఐటీడీఏలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమావేశ మందిరంలో నిర్వహించిన యూత్ సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యంలో మాతా, శిశు మరణాల నివారణకు పెరుమాల్ సంస్థ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పెరుమాల్ సంస్థ సేవలను ఏజెన్సీ 11 మండలాలకు విస్తరించాలన్నారు. వైద్యారోగ్య శాఖ భాగస్వామ్యంతో పాఠశాల విద్యార్థులకువైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సికిల్‌సెల్ ఎనిమీయా బాధితులకు ప్రభుత్వ పింఛన్లు అందేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెరుమాల్ సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో గిరిజన విద్యార్థికి బంగారు పతకం



పోటీల్లో బంగారు పతకం సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న కడప డీఐజీ చలపతిరావు

గూడెంకొత్తవీధి: అండర్17 రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మండలంలోని గూడెంకాలనీకి చెందిన గిరిజన విద్యార్థి గొర్లె నిఖిల్ బంగారుపతకంతో పాటు వైట్ బెల్టు సాధించాడు. గ్రామానికి చెందిన గొర్లె అచ్చిరాజు కుమారుడు నిఖిల్ ప్రస్తుతం విశాఖలోని మధురవాడలో ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. ఇతని తండ్రి విశాఖలోని ఓ మెడికల్ షాపు వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 5న కడపలో జరిగాయి. ఈ పోటీల్లో నిఖిల్ ప్రతిభ కనపరిచాడు. ఇతన్ని కడప డీఐజీ చలపతిరావు అభినందించి మెడల్‌ను అందించారు.

660 మందికి వైద్యపరీక్షలు



గిరిజనులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

అరకులోయ రూరల్: మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ కేంద్రంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించి, 660 మందికి వైద్య పరీక్షలు చేశారు. పశుసంవర్ధకశాఖ ఏడీ అశ్వత్థామ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు తన వంతు సాయం అందించాలనే సంకల్పంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కంటి సమస్యలు ఉన్నవారికి విజయనగరంలోని ఆస్పత్రిలో ఉచిత శస్త్ర చికిత్స చేయించేందుకు బస్సులో తరలించనున్నట్టు తెలిపారు. వైద్య శిబిరంలో వైద్యాధికారులు లక్ష్మీ ప్రసన్న, దుర్గ వెంటేష్,వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్, భాస్కర్, చిన్నరావు, విజయ్, సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

21కె రన్‌లో సచివాలయ ఉద్యోగికి ద్వితీయస్థానం



బహుమతి పొందిన సచివాలయం ఉద్యోగి గోపి

అనంతగిరి: మండలంలోని రొంపల్లి సచివాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొర్రా గోపి 21కె రన్‌లో ద్వితీయ బహుమతి పొందాడు. సోమవారం కాకినాడలో ఈ పోటీలు జరిగాయి. పోటీల్లో 150 మంది వరకు పాల్గొనగా, కొర్రా గోపి ద్వితీయస్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించాడు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం సహించం

పీడీ రమేష్ రామన్

చింతపల్లి: ఉపాధి పనుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఉపాధి హామీ పథకం పీడీ రమేష్ రామన్ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి పథకం అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనదారులకు తప్పనిసరిగా 100 రోజుల పాటు పని కల్పించాలని, రోజుకు రూ.257 చొప్పున వారు వేతనం పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పనుల నిర్వహణపై పంచాయతీలా వారీగా వార్షిక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏపీడీ రామరావు,ఎంపీడీవో లాలం సీతయ్య ,ఏపీవో కొండబాబు, ఈసీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

సాక్షి,పాడేరు: జవహర్ నవోదయ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశాల ఎంపిక పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈనెల 31వ తేదీ లోగా www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, రిన్ని వివరాలకు అన్ని మండలాల ఎంఈవోలను సంప్రదించాలని ఆయన సూచించారు. వోదయలో ఆరోవ తరగతి ప్రవేశాలకు ఎంపిక పరీక్ష ఏప్రిల్ 29న జరుగుతుందని ఆయన తెలిపారు.

సర్వేయర్లకు మెడికల్ కిట్ల పంపిణీ



సర్వేయర్లకు మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని 330 మంది సర్వేయర్లకు ప్రభుత్వం మెడికల్ కిట్లు, ఇతర సామగ్రిని అందుబాటులోకి తెచ్చింది. కలెక్టరేట్‌లో సోమవారం సర్వేయర్లకు మెడికల్ కిట్లు, రెయిన్ కోట్లు, బ్యాగులు, జియో సిమ్‌కార్డులను కలెక్టర్ సుమిత్ కుమార్ పంపిణీ చేశారు. సర్వేయర్ల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని,అన్ని జాగ్రత్తలు తీసుకుని భూముల సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో సర్వేశాఖ ఏడీ వై.మోహనరావు,సర్వేయర్లు పాల్గొన్నారు.

మార్చి నెలాఖరులోగా ప్రభుత్వ భవనాలు పూర్తి

- రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బాలునాయక్
- మేడిచర్లలో సచివాలయ సముదాయాల పరిశీలన



మేడిచర్ల-రొంగలినాయుడుపాలెం రోడ్డును పరిశీలిస్తున్న ఈఎన్‌సీ బాలునాయక్

కె.కోటపాడు: నిర్మాణంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలన్నీ మార్చి నెలాఖరులోగా పూర్తయ్యేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బాలు నాయక్ తెలిపారు. మేడిచర్ల–రొంగలినాయుడుపాలెం గ్రామాల మధ్య నిర్మాణం పూర్తి చేసుకున్న తారురోడ్డును ఆయన సోమవారం పరిశీలించారు. ఏడున్నర మీటర్ల పొడవైన రోడ్డును పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్మించడంతో ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం మేడిచర్లలో ఇటీవల ప్రారంభించిన సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నూతన భవనాలను ఈఎన్‌సీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 10,917 సచివాలయాల్లో 5,398 భవనాలు పూర్తవ్వగా, 2200 నిర్మాణం చివరి దశలో ఉన్నాయని తెలిపారు. 10,243 రైతు భరోసా కేంద్రాల్లో 3,593 భవనాలు పూర్తవ్వగా.. 1600 భవనాల నిర్మాణాలు చివరిదశలో ఉన్నాయని, 8,320 విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలలో 2,000 భవనాల నిర్మాణం పూర్తవ్వగా.. 1500 నిర్మాణాలు చివరిదశలో ఉన్నట్లు ఆయన తెలిపారు. కొద్ది రోజుల్లోనే కాంట్రాక్టర్లకు రూ.444 కోట్లు చెల్లించేలా చర్యలను తీసుకోనున్నట్లు తెలిపారు. ఆయన వెంట విశాఖపట్నం పంచాయతీరాజ్ ఎస్‌ఈ రవీంద్ర, డీపీఆర్‌ఈవో వీరన్ననాయుడు, పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాసరావు, క్వాలిటీ కంట్రోల్ ఈఈ ప్రసాద్, డీఈ రమణమూర్తి, మాడుగుల పీఆర్ డీఈ రమణ, ప్రాజెక్ట్స్ డీఈ వెంకటరావు, జేఈలు బాలాజీ అప్పారావు, రామ్మూర్తి, శేషయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ సీజ్

చోడవరం రూరల్: మండలంలోని ముద్దుర్తి జంక్షన్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్టు చోడవరం ఎస్‌ఐ అప్పలనాయుడు తెలిపారు. సోమవారం ఉదయం 6 గంట సమయంలో ముద్దుర్తి కొత్త పల్లి గ్రామానికి చెందిన పల్లా శ్రీను లారీలో రెండు యూనిట్ల ఇసుకను అక్రమంగా లోడు చేసి తరలిస్తుండగా తమ సిబ్బంది దాడి చేసి ఇసుక లారీని సీజ్ చేసి, లారీ డ్రైవర్ శ్రీనును అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. ఇసుక లారీని చోడవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌ను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఆలయ హుండీ చోరీ

రావికమతం: చినపాచిల గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయం హుండీ ఆదివారం రాత్రి చోరీకి గురైంది. ఆ ఆలయ గేటుకు వెల్డింగ్ చేసిన హుండీని గుర్తు తెలియని దొంగలెవరో ఎత్తుకు పోయారని ఆలయ కమిటీ సభ్యులు రావికమతం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు సోమవారం ఆలయాన్ని పరిశీలించి విచారణ చేస్తున్నారు. ఆ హుండీలో సుమారు రూ.2వేల వరకూ ఉండవచ్చని మొత్తం హుండీతోనే ఎత్తుకు పోయారని గ్రామస్తులు ఎస్‌ఐకు వివరించారు.

సంతకు పండగ కళ



కిటకిటలాడిన పెదబయలు వారపు సంత

- వస్త్రాలు, మట్టి కుండలు, గిరిజన సంప్రదాయ వాయిద్యాల అమ్మకాలు
- కోళ్లకు గిరాకీ



సంతలో పందెం కోళ్ల అమ్మకాలు



కుండలు కొనుగోలు చేస్తున్న మహిళలు

పెదబయలు: మన్యంలో వారపు సంతలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. పెదబయలు మండల కేంద్రంలో సోమవారం జరిగిన వారపు సంత కిటకిటలాడింది. గిరిజనులు తాము పండించిన పంటలు సంతలో అమ్మకాలు చేసి కుటుంబ సభ్యులు నూతన వస్త్రాలు, పండగకు సరిపడిన వంట సామగ్రి కొనుగోలు చేశారు. సంతలో దుస్తుల వ్యాపారం జోరుగా సాగింది. సంక్రాంతి పండగకు మట్టి కుండల్లో వంట చేయడం గిరిజనుల ఆనవాయితీ. ఈ మేరకు మట్టి కుండలు, వెదురుబుట్టల అమ్మకాలు ఎక్కువగా జరిగాయి. కోళ్ల వ్యాపారం బాగా జరిగింది.

పందెం కోళ్లకు గిరాకీ

పెదబయలు వారపు సంతలో పందెం కోళ్లకు గిరాకీ నెలకొంది. కోడిపుంజు రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పైబడి ధర పలికింది. ఎక్కువగా పందెం కోళ్ల అమ్మకాలు ఎక్కువగా జరిగాయి.